2లో

పరకాల చలి వాగులో ఇసుక మాఫియా..!

PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

2లో

మంత్రుల బృందం, రైతు నేతల చర్చలు

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 50 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 04 రూ - 03/- సోమవారం 19 ఫిబ్రవరి 2024

సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా

హైదరాబాద్,ఫిబ్రవరి18 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ వక్ఫ్‌బోర్డు కొత్త చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ తో కలిసి ఆయన ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా ఆయన ఇటీవల ఎన్నికైన విషయం తెలిసింది. చైర్మన్‌తో పాటు బోర్డు పాలమండలి సభ్యులు కూడా సిఎంను కలిసిన వారిలో ఉన్నారు. చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కరెంట్ మీటర్ రీడర్ల సమ్మె

- 'గృహజ్యోతి' వివరాలు నమోదు చేయం
- 30 రోజులు పని కల్పించాలి
- కనీస వేతనాలు ఇవ్వాలి
- ఆర్టిజన్లుగా గుర్తించాలి

హైదరాబాద్,ఫిబ్రవరి18 (పిసిడబ్ల్యూ న్యూస్): కరెంటు మీటర్ రీడర్లు సమ్మె బాట పట్టారు. సుదీర్ఘకాలంగా తమ సమస్యల్ని అధికారులకు మొర పెట్టుకుంటున్నా పట్టించుకోవట్లేదని, గత్యంతరం లేక సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని మీటర్ రీడర్లు అంటున్నారు. పీస్ రేట్ వర్కర్లుగా పనిచేస్తున్న కరెంటు మీటర్ రీడర్లకు నెలలో కేవలం 15 రోజులు మాత్రమే పని ఉంటుంది. ఒక మీటరు రీడింగ్ తీస్తే వారికిచ్చేది కేవలం రూ.2.51 పైసలు. దానిలో కాంట్రాక్టర్లు 50 నుంచి 60 పైసలు మినహాయించుకొని మిగిలిన సొమ్మును వారికి చెల్లిస్తున్నారు. ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పనిచేశాక, మిగిలిన రోజుల్లో ఖాళీగా ఉండాల్సి వస్తున్నది. మిగిలిన 15 రోజుల పనికూడా తమకు కల్పించాలని పలుమార్లు విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కంలు) ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సంస్థల్లోని అనేక విభాగాల్లో వీరి సేవల్ని వినియోగించుకొనే అవకాశాలు ఉన్నా, యాజమాన్యం వారికి పని ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేయట్లేదు. సుదీర్ఘకాలంగా ఈ సమస్యపై వారు పలురూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. 15 రోజులు కరెంటు మీటర్ రీడింగ్ చేస్తే పీస్ రేట్ ప్రకారం వారికి వచ్చే వేతనం కేవలం రూ.5 వేల నుంచి రూ.6 వేల లోపు మాత్రమే దీనిలోనే రవాణా ఖర్చులు కూడా భరించాలి. రాష్ట్రవ్యాప్తంగా రెండు డిస్కంల్లో దాదాపు 2,200 మంది మీటర్ రీడర్లు కాంట్రాక్టర్ల ద్వారా పనిచేస్తున్నారు. తమకు 30 రోజులు పని కల్పించి, కనీస వేతనాలు ఇస్తూ ఆర్టిజన్లుగా గుర్తించాలనేది వారి ప్రధాన డిమాండ్. అనేక పోరాటాల ఫలితంగా వీరికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించారు. అయితే కాంట్రాక్టర్లు పీఎఫ్ సొమ్మును సక్రమంగా చెల్లించట్లేదు.

'గృహజ్యోతి'తో తిప్పలు

తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

వివరాలు 2లో

ఇతర రాష్ట్రాలకు విస్తరిస్తున్న సింగరేణి

- ఒడిశాలో మొదటి సారిగా సింగరేణి గని నైనీ

హైదరాబాద్,ఫిబ్రవరి18 (పిసిడబ్ల్యూ న్యూస్): సింగరేణి తెలంగాణకే పరిమితం కాకుండా, ఇతర రాష్ట్రాల్లోనూ బొగ్గు గనులు చేపట్టాలన్న రాష్ట్ర లక్ష్యంతో సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా ఇతర రాష్ట్రాల్లోని లాభసాటియైన బొగ్గు బ్లాకులను చేపట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో సింగరేణి సంస్థ ప్రతిపాదనల మేరకు కేంద్ర బొగ్గు మంత్రి త్వశాఖ ఒడిశా రాష్ట్రంలో నైనీ అనే లాభదాయకమైన బొగ్గు బ్లాకును కేటాయించింది. దీంతో సింగరేణి ప్రతినిధులు ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను స్వయంగా కలిసి బొగ్గు తవ్వకాలకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఒడిశా రాష్ట్రంలో సింగరేణికి కేటా యించిన నైనీ బొగ్గు బ్లాకులో 455 మిలియన్ టన్నుల నిల్వలు ఉన్నాయి.

వివరాలు 2లో

ఐటిడిఏ ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారు: భట్టి

3.02.2024 ఉ
ఐటీడీఏ స

భద్రాచలం,ఫిబ్రవరి18 (పిసిడబ్ల్యూ న్యూస్): సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ భద్రాచలం పాలకమండలి సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో ఐటీడీఏ సమావేశాలు నిర్వహించకుండా వాటి ప్రధాన ఉద్దేశాలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న గత బిఆర్ఎస్ ప్రభుత్వం.. ఐటిడిఏ ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. గిరిజన కుటుంబాలకు మేలు జరిగే విధంగా పాలకమండలి సమావేశంలో సభ్యులు సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. విద్య, వైద్యం, ఆశ్రమం, ఉపాధికి బాటలు వేసే విధంగా ఐటీడీఏ ప్రణాళికలు ఉండాలని చెప్పారు. ఐటీడీఏ పరిధిలో గిరిజన జీవన స్థితిగతులు మెరుగుపడాలంటే.. విద్య అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని.. ఆ దిశగా అధికారుల ప్రణాళికలు రూపొందించాలని డిప్యూటీ సీఎం చెప్పారు. రెసిడెన్షియల్, ఆశ్రమ,పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు భట్టి. పదవ తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు ఉన్నత చదువులు వెళ్లడానికి కావలసిన సహకారం, అవగాహన కల్పించాలన్నారు. జూని యర్ కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలని ఇంటర్ నుండి ఉన్నత చదువులకు వెళ్ళని విద్యార్థులకు స్వయం ఉపాధి కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలని భట్టీ విక్రమార్క సూచించారు.

జైనమతపెద్ద ప్రాయోపవేశ నిర్యాణం

- దిగంబర జైనుల వర్గానికి పెద్దదిక్కు

రాయ్‌పూర్,ఫిబ్రవరి18 (పిసిడబ్ల్యూ న్యూస్): ప్రముఖ జైన మతపెద్ద ఆచార్య విద్యాసాగర్ మహారాజు ఆదివారం ప్రాయోపవేశం ద్వారాతనవు చాలించారు. ఆయన సల్లేఖన ప్రక్రియలో ఆదివారం కన్నుమూసినట్లు, ఆయన మృతివార్తను చత్తీస్‌గఢ్‌లోని దొంగార్‌ఘర్‌లోని జైన చంద్రగిరి తీర్థ ధర్మకర్తల మండలి తెలిపింది. ఈ స్వామిజి వయస్సు 77 సంవత్సరాలు . ఆధ్యాత్మిక పరిపూర్ణత, మానవాళి సంక్షేమానికి జైన మతాచారం ప్రకారం ఈ సల్లేకన అనే ప్రాయోపవేశ ఘట్టం ఆచరిస్తారు. మతపెద్దలు ఇందులో భాగంగా తమకు తాము మరణించే వరకూ ఉపవాస దీక్షకు పాల్పడుతారు. ఈ క్రమంలోనే ఆయన ఆదివారం మృతి చెందినట్లు ట్రస్ వర్గాలు నిర్ధారించాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆయన గౌరవార్థం ఆదివారం సగంరోజు సంతాప దినం పాటించింది. దిగంబర జైన సాధువుల సాంప్రదాయం తంతులో ఆచార విద్యాసాగర్ మహారాజు జీ ప్రముఖులు అని, ఆయన మరణం పట్ల ప్రగాఢ సంతాపం తెలియచేస్తున్నామని ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటన వెలువరించింది.

హైదరాబాద్‌లో ఐటి సోదాల కలకలం

INCOME TAX DEPAR

హైదరాబాద్,ఫిబ్రవరి18 (పిసిడబ్ల్యూ న్యూస్): హైదరాబాద్ నగరంలో ఐటి సోదాలు కలకలం రేపా యి. ఓ వ్యాపారి ఇంటిపై ఆదాయపు పన్ను ఎగవేతకు పాల్పడుతున్నా రన్న అభియోగంపై సోదాలు నిర్వహించినట్లు ఎసిబి స్పష్టం చేసింది. హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని ఓ స్థిరాస్తి వ్యాపారి ఇంట్లో ఆదాయ పన్ను శాఖాధికారులు సోదాలు నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ నేత అందెల శ్రీరాములు యాదవ్ ఇంటితో పాటు ఆయన వ్యాపార భాగ స్వా మి సామంత్ రెడ్డి నివాసంలో ఐటీ దాడులు జరిగాయి. వీరి నివాసాల్లో అణువణువును ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహించి, పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సోదాల్లో నగదు స్వాధీనం చేసుకున్న ట్లు ఎలాంటి స్పష్టత రాలేదు. ఐటీ అధికారులు ఏమీ వెల్లడించలేదు. అయితే, వ్యాపార లావాదేవీలకు సంబంధించి కీలక ఫైళ్లు, డాక్యుమెంట్లు, పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అందెల శ్రీరాములు ఆర్థిక లావా దేవీ ల్లో అవకతవకలకు సంబంధించిన వ్యవహారాలపై పలు కోణాల్లో ఐటి శాఖ అధికారులు ఆరా తీశారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు బిజెపి నేత నివాసంలో ఐటి దాడులు జరగడం చర్చనీయాంశంగా మారింది. కాగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరపున మహేశ్వరం నుంచి శ్రీరాము లు పోటీ చేశారు. బిఆర్ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతిలో 26 వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు.

ఎంపీ వద్దిరాజుకు శుభాకాంక్షల వెల్లువ

హైదరాబాద్,ఫిబ్రవరి18 (పిసిడబ్ల్యూ న్యూస్): రాజ్యసభకు తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికవుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఏపి మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రముఖ సినీ హీరో రాంచరణ్, లోక్‌సభ సభ్యులు కనుమూరి రఘురామ కృష్ణంరాజు, ఎంఎల్ఏ సామినేని ఉదయభాను తదితరులు రవిచంద్రకు శుభాకాంక్షలు చెప్పారు. సామాజికవేత్త ఖాశెట్టి కుమార్, ప్రముఖ విద్యావేత్త లక్కినేని ప్రసాద్,సినీ ప్రముఖులు మల్లం రమేశ్, మున్నూరుకాపు ప్రముఖులు వేల్పుల శ్రీనివాస్,బొల్లం లక్ష్మణ్,రంగస్థల నటుడు చల్లగాలి వెంకటరాజు, వ్యాపారవేత్తలు సుమీర్ జైన్.పి.హనుమంతరావు,టి.రాజ కుమార్, కౌశిక్ కేటరర్స్ అధినేత ఆలపాటి లక్ష్మీనారాయణ తదితరులు ఎంపీ వద్దిరాజును కలిసి శుభాకాంక్షలు చెప్పారు.

మేడారం జాతరలో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ

మేడారం సమ్మక్క - సారక్క జా
తల నీలాలు సమర్పించు
కళ్యాణ కట్టస్థలం

హైదరాబాద్,ఫిబ్రవరి18 (పిసిడబ్ల్యూ న్యూస్): మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఫిబ్రవరి 21 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి పలు చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా మేడారంకు వచ్చే యాత్రికులకు జాతర స్థలంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, మున్సిపల్ ఘన వ్యర్థాలు అలాగే బయోమెడికల్ వ్యర్థాల గురించి అవగాహన కల్పిస్తూ ఆయా డబ్బాల్లోనే వేయాలని చెబుతోంది. పర్యావరణం, ఆరోగ్యం, ప్రజల జీవితంపై కాలుష్య ప్రభావాన్ని పలువురికి వివరిస్తూ ఎక్కడంటే అక్కడ వేయకుండా నిర్దేశించిన డబ్బాల్లో వేసేలా చూస్తోంది. అంతే కాకుండా ఈ మేరకు టిఎస్ పిసిబి ప్రాంతీయ కార్యాలయం వరంగల్ , 6 కళ్యాణకట్ట, వేర్వేరు పాయింట్ల వద్ద ఆయా వ్యర్థాలను సేకరించడానికి పలు ప్రత్యేక డబ్బాలను ఏర్పాటు చేసింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో తలనీలాలను ఇచ్చె కళ్యాణ కట్ట వద్ద కూడా

వివరాలు 2లో

నేటి నుండి పశువుల సంతలో మేడారం జాతరకు బస్సులు

- పరకాల డిపో మేనేజర్ రవి చందర్

పరకాల, ఫిబ్రవరి18 (పిసిడబ్ల్యూ న్యూస్): నేటి(సోమవారం) నుండి పరకాల మండల కేంద్రంలోని పశువుల సంత లో సమ్మక్క- సారలమ్మ మేడారం జాతరకు వెళ్లే బస్సులు, ఇక నుండి జాతర పూర్తయ్యే వరకు పశువుల సంత మైదానం నుండే ఆర్టీసీ బస్సులు బయలుదేరుతాయని, భక్తులు గమనించాలని, ఇందులో 220 ప్రత్యేక బస్సులు ప్రజలకు అందుబాటులో ఉంచామని, రూ. 250, చిన్నారులకు రూ. 140, మహిళలకు ఉచిత ప్రయాణం ఉంటుందని, మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణం చేసే మహిళలు ఒరిజినల్ ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పరకాల డిపో మేనేజర్ రవిచందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఇతర రాష్ట్రాలకు విస్తరిస్తున్న సింగరేణి

(మొదటి పేజీ తరువాయి)

నైనీ బొగ్గు బ్లాకు నుండి ఏడాదికి 100 లక్షల టన్నుల బొగ్గు తీయడం కోసం ప్రణాళిక సిద్ధం చేసి అన్ని అనుమతులను ఇప్పటికే సంస్థ సాధించింది. అంతే కాకుండా ఇటీవలనే ఈ బొగ్గు గనికి సంబంధించి నిర్వహించిన ప్రజాభిప్రాయంలో స్థానిక ప్రజలు తమ పూర్తి సానుకూలతను తెలిపారు. ఈ ఏడాది చివరకు ఈ గని నుంచి 60 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయనున్నారు. తర్వాత ప్రతి సంవత్సరం 100లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయనున్నారు. పవర్ డంపర్, సర్ఫేస్ మైనర్ విధానం బొగ్గు తవ్వనున్న ఈ ఓపెన్ కాస్ట్ గనిలో మరో 1200 మంది ఔట్ సోర్సింగ్ మరో 1200 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉపాధి కల్పించ అవకాశం ఉంది. నైనీ బొగ్గు బ్లాక్ సంబంధించి స్టేజ్- 1, స్టేజ్-2 అనుమతులు సాధించడంలో సంస్థ ఉన్నతాధికారులు గని అనుమతులపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ను కలిసి సహకారం కోరారు. నైనీ బొగ్గు బ్లాకు నుండి ఉత్పత్తి అయిన బొగ్గును హండప్ప రైల్వే సైడింగ్ వరకు అక్కడ నుండి రైలు మార్గం ద్వారా రవాణాకు 6 పూర్తి చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇక్కడ నుంచి 60 లక్షల టన్నుల బొగ్గు, తల సంవత్సరాలలో ఏడాదికి 100 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుంది.

మేడారం జాతరలో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ

(మొదటి పేజీ తరువాయి)

డబ్బాలను ఏర్పాటు చేసి తలనీలాల సమర్పించిన బ్లేడ్‌లు ఇతర వ్యర్థాలను కూడా సేకరిస్తోంది. ఇలా అక్కడి నుండి సేకరించిన బయోమెడికల్ వ్యర్థాలను పారవేసే చోటికి తరలించనున్నారు. ఇప్పటికే ఈ పనిని చూసే సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను పిసిబి ఇటీవలే నిర్వహించింది కూడా. వ్యాధులు వ్యాప్తి చెందకుండా , ప్రజారోగ్యం , పర్యావరణాన్ని పరిరక్షించడానికి పిసిబి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. వ్యర్థాలను సరైన పద్ధతిలో సేకరించి పారవేయడంలోనూ సమన్వయం చేస్తున్నామంటున్నారు.

మంత్రుల బృందం, రైతు నేతల చర్చలు

చండీగఢ్,ఫిబ్రవరి18 (పిసిడబ్ల్యూ న్యూస్): రైతు నేతలు, కేంద్ర మంత్రుల బృందం నడుమ ఆదివారం రాత్రి తిరిగి చర్చలు ఆరంభమయ్యాయి. తమ డిమాండ్ల సాధనకు పంజాబ్ రైతులు ఢిల్లీ చలో యాత్ర తలపెట్టడం ప్రతిష్టంభనకు దారితీసింది. సమస్య పరిష్కారానికి ఇరుపక్షాల నడుమ ఇప్పుడు నాలుగో దఫా సంప్రదింపులు సాగాయి. కేంద్రం తరఫున వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా, ఇతర మంత్రులు పియూష్ గోయల్, నిత్యానంద్ రాయ్ బృందంగా వచ్చారు. ఇక్కడి మహాత్మా గాంధీ స్టేట్ ఇనిస్టూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎంజిసిపా) భవనంలో సంప్రదింపులకు పంజాబ్ సిఎం భగవంత్ మాన్ కూడా హాజరయ్యారు. శంభూ సరిహద్దులలో ప్రదర్శన దశలో గాయపడి మృతి చెందిన గియాన్ సింగ్‌కు నివాళి తరువాత రైతుల నేతలు చర్చవేదికకు తరలివచ్చారు. పంజాబ్ సిఎంతో పాటు రాష్ట్ర వ్యవసాయ మంత్రి గుర్మీత్ సింగ్ ఖుదియన్ కూడా ఉన్నారు. అంతకు ముందు కేంద్ర మంత్రులు తమలో తాము రైతుల డిమాండ్ల సాధ్యాసాధ్యాలపై చర్చించారు. అయితే డిమాండ్ల సాధనకు రైతుల నేతలు పట్టుదలతో ఉన్నట్లు వెల్లడైంది. మోడీ ముందుగా స్పందించాలని లేకపోతే మంత్రుల స్థాయి బృందంతో చర్చలు ఏ మేరకు ఫలితం ఇస్తాయని రైతులు ప్రశ్నించారు. రైతుల తరఫున నేతలు జగ్జిత్ సింగ్ దాలేవాల్, సర్వాన్ సింగ్ పంథేర్, సుర్జిత్ సింగ్ ఫూల్, జస్వీందర్ సింగ్ లోంగోవాల్, సత్నామ్ సింగ్, అమర్జిత్ సింగ్ మెహ్రీ ఇతరులు ఉన్నారు.

పరకాల చలి వాగులో ఇసుక మాఫియా..!

- ఈ దందాకు ఎవరు సపోర్ట్ చేస్తున్నారు?

- డంపు చేసి అక్రమ రవాణా!

పరకాల ప్రత్యేక ప్రతినిధి, ఫిబ్రవరి 18 (పిసిడబ్ల్యూ న్యూస్): పరకాల చలి వాగులో మళ్లీ ఇసుక తుఫాన్ మొదలైంది. ఆ ఇసుక మాఫియాలో పరకాల చెందిన ప్రముఖులే కొనసాగుతుండడం గమనార్హం. గతంలో అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడిన వారు స్థానిక నాయకుల అండదండలతో కొనసాగించారు. ప్రస్తుతం కూడా అదే తరహాలో చలి వాగు నుంచి ట్రాక్టర్లలో ఇసుకను తరలించి, ఇతర ప్రాంతాలకు ఎక్కువ ధరకు రవాణా చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాతో చలివాగు పరిహార ప్రాంత ఆయకట్టు రైతుల పంటలకు భూగర్భ జలాలు అడుగంటిపోయి ఎండిపోతున్నాయని చెబుతున్నారు. అప్పటి పాలకులు మారినప్పటికీ పరకాలకు చెందిన ఆ ప్రముఖులు ప్రస్తుత ప్రజా నాయకులు, ప్రతినిధుల పేర్లు చెప్పి ఆన్లైన్ విధానంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఇసుక దందా యద్దేచ్ఛగా కొనసాగుతున్నా సంబంధిత అధికారులు స్పందించ కపోవడం గమనార్హం. ఇంత తంతు కొనసాగుతున్న అధికారులు పట్టించుకోకపోవడంపట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సకల అసమానతల నిర్మూలన కోసం అవిశ్రాంత కృషిసల్పిన డాక్టర్ జయగోపాల్

- సంస్మరణ సభలో సంఘాల నాయకులు

హనుమకొండ, ఫిబ్రవరి 18 (పిసిడబ్ల్యూ న్యూస్): తరతరాలుగా భారతదేశంలో సృష్టించి కొనసాగిస్తున్న వర్ణ వ్యవస్థ వల్ల ఏర్పడిన సకల అసమానతలను రూపుమాపడం కోసం భారత నాస్తిక సమాజం వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ జయగోపాల్ నిర్విరామ కృషి చేశాడని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం హన్మకొండ జిల్లా కేంద్రం భీమారం పెరియార్ భవన్ భారత నాస్తిక సమాజం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన డాక్టర్ జయగోపాల్ సంస్మరణ సభలో విముక్త చిరుతల కక్షి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలకర శ్రీనివాస్, ఆల్ ఇండియా ఒబిసి ఛైర్మన్ సాయిని నరేందర్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి హరికృష్ణ, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ సమన్వయకర్త చార్వాక, హేతువాద సంఘం నాయకులు రమాదేవి, వేదాంత, భారత నాస్తిక సమాజం రాష్ట్ర కన్వీనర్ ఉప్పులేటి నరేష్, మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం అధ్యక్షుడు బైరి నరేష్ తదితర నాయకులు జయగోపాల్ సమాజహితం కోసం చేసిన త్యాగపూరిత పోరాటాన్ని కొనసాగించినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని వారు అన్నారు. రాబర్ట్ గ్రీన్ ఇంగిర్ సాల్, చార్లెస్ బార్లే లాంటి అంతర్జాతీయ మానవ హక్కుల నేతలతో పాటు భారతదేశంలోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, పెరియార్ లాంటి మహనీయులను అధ్యయనం చేసి వారి భావజాలాన్ని ఆయుధంగా చేసుకొని పోరాటం చేయడమే కాకుండా ఇంగ్లీష్, తెలుగులో ఎన్నో రచనలు చేసి, ఎన్నో సమావేశాల్లో ప్రసంగాలు చేసి ప్రజలను చైతన్యం చేయడంలో జయగోపాల్ కృషి చాలా గొప్పదని వారు అన్నారు. కుల వివక్ష, వర్ణ వివక్ష, లింగ వివక్షతతో పాటు మూఢనమ్మకాల నిర్మూలన, మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేసిన జయగోపాల్ భారతదేశంలో మూఢనమ్మకాల నిర్మూలన చట్టం తీసుకురావాలని ఎంతో పోరాటం చేశారని తెలిపారు. **తీర్మానాలు:** భారత సమాజంలో జరుగుతున్న పోరాటాలకు మద్దతు పలుకుతూ, జరుగుతున్న దుష్ట సంఘటనలపై తీర్మానాలు చేశారు. ఢిల్లీలో జరుగుతున్న రైతాంగ పోరాటానికి మద్దతు తెలిపారు. కామారెడ్డిలో మహిళపై జరిగిన దాడిపై, వరంగల్ జిల్లాలో మంత్రాల నెపంతో తల్లి కొడుకులను హత్యను, దన్వాడ చర్చి పై ఆర్ ఎస్ ఎస్ చేసిన మూఖ దాడిని భారత నాస్తిక సమాజం ఖండిస్తున్నట్లు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో భారత నాస్తిక సమాజం జాతీయ నాయకులు శ్యామల, రశీదు, జ్యోతికుమార్, రాష్ట్ర నాయకులు గుమ్మడిరాజుల సాంబయ్య, గుత్తికొండ చక్రధర్, పెంద్యాల సుమన్, జాబాలి, యాదగిరి, వివిధ సంఘాల నాయకులు ఐతమ్ నగేష్, చాపర్తి కుమార్ గాడ్గే, పటేల్ వనజక్క, వెలుగు వనుతక్క, అరునక్క, రమాదేవి, అమ్మవొడి శ్రీనివాస్, సింగారపు అరుణ, స్వప్న, సంతోష్, అనిల్, రాసమల్ల లక్ష్మన్, పిడిఎస్యు నవ్యలు పాల్గొన్నారు.

కరెంట్ మీటర్ రీడర్ల సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

అందించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి మీటర్ రీడింగ్ తో పాటు వినియోగదారుల ఫోన్ నెంబర్, ఆధార్ నెంబర్, ఆహార భద్రతా కార్డు నెంబర్లు (రేషన్ కార్డు)కూడా నమోదు చేయాలని కాంట్రాక్టర్లు మీటర్ రీడర్లపై ఒత్తిడి తెస్తున్నారు. ఒక్కో మీటర్ కు సంబంధించిన వివరాల నమోదుకు 15 నుంచి 20 నిముషాల సమయం పడుతున్నదనీ, దీనివల్ల నిర్ణీత గడువులోపు తమకు అప్పగించిన మీటర్ల రీడింగ్ తీయలేకపోతున్నామని వారు చెప్తున్నారు. రీడింగ్ ఆలస్యం అయితే వినియోగదారుల శ్లాబ్ రేట్లు మారిపోయి, కరెంటు బిల్లులు అధికంగా వచ్చే ప్రమాదం ఉంది. ఇదే విషయాన్ని కాంట్రాక్టర్లకు చెప్తే పట్టించుకోవట్లేదు. దీనితో ఈనెల 6, 7 తేదీల్లో మీటర్ రీడర్లు రాష్ట్ర వ్యాప్తంగా తమ వద్ద ఉన్న మీటర్ రీడింగ్ యంత్రాలను కాంట్రాక్టర్లకు అప్పగించేశారు. యాజమాన్యంతో మాట్లాడి తమ సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. అయితే దీనికి కాంట్రాక్టర్లు అంగీకరించలేదు. ‘మీ సమస్యలు పరిష్కారమైతే, మా ఆదాయం పోతుంది’ అంటూ రీడింగ్ యంత్రాలు స్వాధీనం చేసుకొని సైలెంట్ అయిపోయారు. ఫలితంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఆరు గ్యారెంటీల్లో ముఖ్యమైన గృహజ్యోతి, మహాలక్ష్మి స్కీంలకు సంబంధించిన డేటా ఎంట్రీ నిలిచిపోయింది, ఈ రెండు స్కీంలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటన చేయనున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి తమ సమస్యల్ని పరిష్కరించాలని మీటర్ రీడర్లు కోరుతున్నారు.

మమల్ని పీస్ రేట్ వర్కర్లుగా చూడవద్దు : చిరంజీవి

ఉన్నత చదువులు చదువుకున్నాము,ఇదే సంస్థను నమ్ముకొని 22 ఏండ్ల నుంచి పనిచేస్తున్నామని, తెలంగాణ రాష్ట్ర విద్యుత్ మీటర్స్ యూనియన్ దక్షణ డిస్కం ప్రధాన కార్యదరి జి. చిరంజీజి అన్నారు. నెలకు 30 రోజులు పనికల్పించి, ఆర్టిజన్సుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. సిఎం రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయన్ని కలిసి మా కష్టాలు చెప్పుకున్నామని, అధికారంలోకి వచ్చాక పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన గుర్తు చేశారు.

ప్రభుత్వానికి సహకరిస్తాం: కె. శేఖర్, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు: సింఎం రేవంత్ రెడ్డి మా సమస్యలను పరిష్కరించాలి

సుదీర్ఘకాలంగా చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకోలేక నానా అవస్థలు పడుతున్నామని,మా సమస్యల్ని సిఎం రేవంత్ రెడ్డి పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. శేఖర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వానికి సహకరించేందుకు మేం సిద్ధమని, మమ్మల్ని ఉద్యోగాల్లోంచి తీసేస్తామని కాంట్రాక్టర్లు బెదిరిస్తున్నారని,మాకు 30 రోజులు పని కల్పించాలన్నారు. కనీస వేతనం ఇవ్వాల్సిందేఃఈ. శ్రీధర్ ఇనుగాల శ్రీధర్, 327 యూనియన్ సెక్రటరీ జనరల్ కార్మిక చట్టాల ప్రకారం పీస్ వర్కర్లు అయినా వారికి కనీస వేతనం చెల్లించాల్సిందే అని, కానీ అది అమలు కావడం లేదని 327 యూనియన్ సెక్రటరీ జనరల్ ఈ శ్రీధర్ తెలిపారు. మీటర్ రీడర్లు చాలాకాలం నుంచి తమ సమస్యల్ని యాజమాన్యాల దృష్టికి తీసుకెళుతున్నారని, దీన్ని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టిఎస్ఎస్పిడిసిఎల్) సిఎండితో చర్చించగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

కవ్వాల్ టైగర్ రిజర్వ్ నుంచి గ్రామాల తరలింపు ప్రక్రియ వేగవంతం

- ఒక్కో కుటుంబానికి రూ. 15 లక్షల పరిహారం

- మరి కొందరికి ఇళ్ల నిర్మాణం, సాగు భూమి కూడా

- అటు వేగంగా నిర్మాణం పూర్తి చేసుకుంటున్న పునరావాస కాలనీ



హైదరాబాద్,ఫిబ్రవరి18 (పిసిడబ్ల్యూ న్యూస్): కవ్వాల్ పులుల అభయారణ్యం నుంచి గ్రామాల తరలింపు ప్రక్రియ వేగవంతం అయ్యింది. అటవీ ప్రాంతం కోర్ ఏరియా నుంచి గ్రామాల తరలింపు, పునరావాసం కాలనీ పనుల పురోగతిని కవ్వాల్ లో అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్) ఆర్.ఏం. డోబ్రియాల్ ఆదివారం సమీక్షించారు. స్థానిక అధికారులతో కలిసి పునరావాస కాలనీని సందర్శించటంతో పాటు, లబ్దిదారులతో సమావేశం అయ్యారు. పులుల అభయారణ్యం నుంచి గ్రామాల తరలింపుపై ఇటీవల సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆరా తీశారు. తరలింపు ప్రక్రియ పారదర్శకంగా ఉండటంతో పాటు, మిగతా గ్రామాలకు ఆదర్శంగా ఉండాలని మంత్రి సూచించారు. దీనిలో భాగంగా పిసిసిఎఫ్ ఆదివారం నాడు క్షేత్ర పర్యటన చేశారు. మొదటి దశలో పునరావాసానికి రాంపూర్, మైసంపేట గ్రామాలు స్వచ్ఛందంగా అంగీకరించాయి. కేంద్ర ప్రభుత్వం (ఎన్‌టిసిఎ) నిబంధనల ప్రకారం రెండు ప్రతిపాదనలతో అటవీశాఖ పనులను చేపట్టింది. గ్రామాల తరలింపులో భాగంగా ఒక్కో కుటుంబానికి ఏకమొత్తంగా 15 లక్షల రూపాయల పరిహారం అందిచటం ఒక ప్రతిపాదన. దీనికి 48 కుటుంబాలు అంగీకరించి ఆ మేరకు పరిహారం స్వీకరిస్తున్నాయి. ఇక రెండవ ప్రతిపాదనకు అంగీకరించిన 94 కుంటుంబాలకు అవే 15 లక్షల పరిహారంలో భాగంగా ఒక ఇల్లు నిర్మాణంతో పాటు సాగు భూమిని కూడా ప్రభుత్వం సమకూర్చుతోంది. ఈ క్రమంలో ఆయా ప్రజల కోసం కవ్వాల్ కు సమీపంలోనే అటవీ ప్రాంతం బయట కొత్త మద్ది పడగలో అన్ని వసతులతో పునరావాస కాలనీ నిర్మాణం వేగంగా జరుగుతోంది. మొత్తం 12.36 ఎకరాల్లో కాలనీ నిర్మాణం అవుతోంది. ఒక్కో కుటుంబానికి 333 చదరపు గజాల్లో ఇల్లు, 2.81 ఎకరాల సాగుభూమిని అందిస్తున్నారు. కాలనీలో సామాజిక ఏర్పాట్లు, పనుల తీరుగా లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. పనులన్నీ పూర్తి కాగానే ప్రభుత్వ ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటుచేసి లబ్దిదారులకు అందిస్తామని పిసిసిఎఫ్ ఆర్.ఎం. డోబ్రియాల్ తెలిపారు. కాగా పర్యటనలో కవ్వాల్ ఫీల్ డైరెక్టర్ శాంతారామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఎలక్ట్రిషన్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

హనుమకొండ జిల్లా స్టాపర్, ఫిబ్రవరి 18(పిసిడబ్ల్యూ న్యూస్): హనుమకొండ జిల్లా కాజీపేట కడిపికొండ ఫ్లై ఓవర్ వద్ద తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రిషన్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జక్కుల రవీందర్ యాదవ్ 62వ డివిజన్ కార్పొరేటర్, 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ-సయ్యద్ రజలి పాల్గొని క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాజీపేట మండల్ అన్ని వర్గాల కార్మిక సోదరులకు అతి త్వరలో కమిటీ హాల్ భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. తప్పకుండా హామీ నెరవేస్తానని ఈ సందర్భంగా అన్నారు. అదే విధంగా కార్పొరేటర్లు జక్కుల రవీంద్ర యాదవ్, విజయశ్రీ-సయ్యద్ రజలి మాట్లాడుతూ.. 62, 63 డివిజన్ల ను ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి సహకారంతో అభివృద్ధిలో తీసుకెళ్తున్నామని, భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ప్రజలకు అందుబాటులో ఉండి డివిజన్ అభివృద్ధికి పాటుపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు బంక సరళ-సంపత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రావుల సదానందం, అంకుష్, మేకల ఉపేందర్, సిరిలారెన్స్, టి.పి.ఈ.టి.ఎఫ్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కమిటీసభ్యులు, పెయింటర్స్ యూనియన్, భవన నిర్మాణం యూనియన్, చిరు వ్యాపారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

అగ్రహంపాడు సమ్మక్క - సారలమ్మ జాతర పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

Shot on OnePlus
Shot on OnePlus

ఆత్మకూర్, ఫిబ్రవరి 18 (పిసిడబ్ల్యూ న్యూస్): హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అగ్రహంపాడ్ శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధి పనుల పరిశీలనలో భాగంగా అగ్రంహపాడు జాతరకు వస్తున్న భక్తులకు ఇబ్బంది కలగకుండా రైతు సొంత ఖర్చులతో బావి ఒడలు పోయడాన్ని ఆదివారం పరిశీలించి వారిని అభినందించిన పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అనంతరం అగ్రహం పాడు జాతర నీటి సదుపాయం కోసం అగ్రంహపాడు మరియు అక్కంపేట గ్రామాలల్లో ఆరు కొత్త బోర్లను ప్రారంభించడం జరిగింది. అనంతరం జాతర సమీపంలో నిర్మాణంలో ఉన్న మరుదొడ్లను మరియు ఇతర పనులను దగ్గరుండి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ జడ్పీటీసీ,సర్పంచ్లు,మండల కమిటీ అధ్యక్షులు,సీనియర్ నాయకులు,యువజన కాంగ్రెస్ నాయకులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబుకు ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ నేతలు

హనుమకొండ జిల్లా స్టాపర్,ఫిబ్రవరి 18(పిసిడబ్ల్యూ న్యూస్): హనుమకొండ పట్టణంలోని పద్మక్షమ్మ దేవాలయ దర్శనానికి విచ్చేసిన రాష్ట్ర ఐటి శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకి, టిపిసిసి ఓబీసీ కో-ఆర్డినేటర్ తౌటం రవీందర్, కార్పొరేటర్ శ్రీమాన్, పార్టీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నేతలు, పార్టీ శ్రేణులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.75కోట్ల ఇంటిని కాజేసేందుకు యత్నిస్తున్న బండ్ల గణేశ్: నౌహీరా షేక్

బంజారాహిల్స్,ఫిబ్రవరి 18(పిసిడబ్ల్యూ న్యూస్): : అద్దెకు తీసుకున్న ఇంటిని కాజేసేందుకు సినీ నిర్మాత, కాంగ్రెస్ నాయకుడు బండ్ల గణేశ్ ప్రయత్నించడంతో పాటు తనపై తప్పుడు కేసు పెట్టాడని హీరా గ్రూప్ అధినేత నౌహీరా షేక్ ఆరోపించారు. బంజారాహిల్స్ రోడ్ నం.10లోని హీరా గ్రూప్ సంస్థ ప్రధాన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నౌహీరా షేక్ మాట్లాడుతూ.. ఫిలింనగర్ సైట్-2లో ఉన్న సుమారు రూ.75కోట్ల విలువైన ఇంట్లోని మొదటి ఫ్లోర్‌ను బండ్ల గణేశ్‌కు 2021 జూన్ 5న అద్దెకు ఇచ్చామని, 11నెలలు రెంటల్ అగ్రిమెంట్ కూడా చేశామని తెలిపారు.గడువు ముగిసిన తర్వాత కూడా తన ఇంటిని ఖాళీ చేయకపోగా, ఈడీ అధికారులు ఇంటిని అటాచ్ చేశారని తెలుసుకున్న బండ్ల గణేశ్.. అడ్డదారిలో ఇల్లు మొత్తాన్ని తన ఆధీనంలోకి తీసుకుని వేధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. 11 నెలలు చేసిన రెంటల్ అగ్రిమెంట్‌ను ఫోర్జరీ చేసి 9 ఏండ్లు అద్దెకు తీసుకున్నట్లు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించాడని, తక్కువ ధరకు ఇంటిని అమ్మాలంటూ ఒత్తిడి తీసుకువస్తున్నారని అన్నారు.ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలుసుకుని అక్కడకు వెళ్లిన తనపై రౌడీల సాయంతో దౌర్జన్యానికి దిగడంతో పాటు ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టారని ఆరోపించారు. ఇంటిని ఆక్రమించుకున్న బండ్ల గణేశ్ పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తే.. పోలీసులు ఆయనకే వత్తాసు పలకడం బాధాకరమన్నారు. ఫిలింనగర్ పోలీసుల వైఖరిపై తాను డీజీపీకి ఫిర్యాదు చేశానని, సోమవారం నగర పోలీస్‌కమిషనర్‌ను కలువనున్నట్లు తెలిపారు.

ప్రయాణికుల సౌకర్యార్థం తొర్రూర్ నుండి ప్రత్యేక బస్సులను ప్రారంభించిన డిఎస్‌పి

తొర్రూరు, ఫిబ్రవరి 18 (పిసిడబ్ల్యూ న్యూస్): మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ టీజీ ఆర్టీసీ బస్టాండ్ నుండి 18వ తేదీ ఆదివారం మేడారం సమ్మక్క సారక్క జాతరకు వెళ్లేందుకు తొర్రూర్‌కు చెందిన డిఎస్‌పి వి సురేష్ ప్రత్యేక బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసంగిస్తూ రెండు సంవత్సరాలకు ఒకసారి మేడారం సమ్మక్క సారక్క జాతరకు ఎంతో ప్రత్యేకత ఉందని భక్తులందరూ ఎలాంటి గొడవలకు తావు లేకుండా ప్రశాంతంగా దర్శనం చేసుకొని రావాలని కోరారు. అనంతరం డిపో మేనేజర్ విశ్వనాధ్ తొర్రూర్ బస్టాండ్ లో జాతరకు వెళ్లే ప్రయాణికులు అందరికీ అన్ని రకాల సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తొర్రూరు, వర్ధన్నపేట బస్టాండ్ నుండి 186 ప్రత్యేక బస్సులను 25వ తేదీ వరకు నడపడం జరుగుతుందని అన్నారు. మేడారం జాతరకు మహిళలకు ఉచిత సౌకర్యం ఉంటుందని తెలియజేశారు. తొర్రూరు నుండి పెద్దలకు 350 చిన్నారులకు200 రూపాయలు ,వర్ధన్నపేట నుండి పెద్దలకు 300 చిన్నారులకు 160రూపాయలుగా టికెట్ ధర నిర్ణయించడం జరిగిందని అన్నారు. బస్సులో ప్రయాణించే మహిళలు ప్రభుత్వం అందజేసిన ఆధార్ కార్డు వెంట తెచ్చుకొని బస్సు కండక్టర్లకు సహకరించాలని అలాగే ప్రయాణికులు డ్రైవర్లను విసిగించవద్దని కోరారు ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రజిత రెడ్డి తిరుమల్ రావు విజయ్ కుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అందాల్సిన పథకాల కోసం ప్రభుత్వంపై పోరాడుతా : సబిత ఇంద్రారెడ్డి

హైదరాబాద్,ఫిబ్రవరి 18(పిసిడబ్ల్యూ న్యూస్): పేదలకు అండగా ఉంటానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల పరిధిలోని దెబ్బడగూడ గ్రామానికి చెందిన కీర్తన అనారోగ్యానికి గురై నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నది. దవాఖాన ఖర్చుల నిమిత్తం సబితా ఇంద్రారెడ్డిని ఆశ్రయించడంతో ఆమె తక్షణమే రూ.లక్షా 50వేల ఎల్‌ఓసీ లెటర్‌ను అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదలను ఆదుకోవడానికి తన వంతు సహకారం అందజేస్తానని చెప్పారు. పేదలకు అందాల్సిన పథకాలు ప్రభుత్వం నుంచి పొట్లాడి తీసుకవస్తానని వివరించారు. పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా నిర్భయంగా తన వద్దకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు కొలను విజేశ్వర్‌రెడ్డి, మంగలి రమేష్ నాయీ, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య బాలరాముడిని దర్శించుకున్న మాజీ మంత్రి తలసాని

హైదరాబాద్,ఫిబ్రవరి 18(పిసిడబ్ల్యూ న్యూస్): అయోధ్య రామమందిరాన్ని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా అయోధ్య ఎమ్మెల్యే రాంచందర్ బిదాయితో కలిసి బాలరాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు తలసాని శ్రీనివాస్ యాదవ్. పూజల అనంతరం ట్రస్ట్ సభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానించారు. హనుమాన్ గుడిని సందర్శించి, పూజలు చేశారు. అక్కడే ఉన్న గురూజీ రాజుదాస్ వద్ద తలసాని ఆశీర్వాదం తీసుకున్నారు.

స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలను కలిసిన జిల్లా నేతలు

హనుమకొండ జిల్లా స్టాపర్, ఫిబ్రవరి 18(పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హార్కరా వేణుగోపాల్ నియామకమయ్యారు. ఈ సందర్భాన్ని ఈ సందర్భాన్ని ఈ సందర్భాన్ని పురస్కరించుకొని, హైదరాబాదులో ఆదివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ చైర్మన్ మిర్జా అజీజుల్లా బెగ్, కార్పొరేటర్ శ్రీమాన్, జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, నాయకులు, తదితరులున్నారు.

రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను కలిసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్, వెంకట్రాంరెడ్డి

హనుమకొండ జిల్లా స్టాపర్, ఫిబ్రవరి 18(పిసిడబ్ల్యూ న్యూస్): హైదరాబాద్ ఎర్రమంజిల్ లోని తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఆఫీస్ లో తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని, ఆదివారంరాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ని, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు, కిసాన్ మోర్చా వరంగల్ ఇన్చార్జి వెంకట నరసింహారెడ్డి లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి కార్యక్రమం రద్దు

హనుమకొండ జిల్లా స్టాపర్,ఫిబ్రవరి 18(పిసిడబ్ల్యూ న్యూస్): హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నేడు (సోమవారం) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని పరిపాలన పరమైన కారణాల (మేడారం మహా జాతర విధుల్లో నిమగ్నమై ఉన్నందు) వల్ల రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి విషయాన్ని గమనించి జిల్లా ప్రజలు ఫిర్యాదులు కలెక్టరేట్ కార్యాలయానికి రాకూడదని వారు అట్టి ప్రకటన లో వెల్లడించారు.

కాజీపేట సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన వై.సుధాకర్ రెడ్డిని కలిసిన కార్పొరేటర్లు

హనుమకొండ జిల్లా స్టాపర్, ఫిబ్రవరి 18(పిసిడబ్ల్యూ న్యూస్): హనుమకొండ జిల్లా కాజీపేట పిఎస్ లో నూతనంగా కాజీపేట (సర్కిల్ ఇన్స్పెక్టర్) సీఐ గా పదవీ బాధ్యతలు చేపట్టిన వై.సుధాకర్ రెడ్డి ని, జక్కుల రవీందర్ యాదవ్ స్థానిక 62వ డివిజన్ కార్పొరేటర్, 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ-సయ్యద్ రాజాలి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగత అభినందనలు తెలిపారు. వారి వెంట బొంద్యాల్, కూకట్ల రమేష్, వక్కల రవీందర్, తదితరులున్నారు.

సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలు

ఖమ్మం, ఫిబ్రవరి 18(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):ఖమ్మం కార్పొరేషన్ పరిధి అయిదవ డివిజన్ యుపిఎస్ కాలనీ ఖానాపురం హవేలి లో గల సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయం నందు రాష్ట్ర అధ్యక్షులు బానోతు కిషన్ నాయక్ ఆధ్వర్యంలో సేవలాల్ మహారాజు 285వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ గొప్ప సంఘ సంస్కర్త అని , గిరిజనుల వలస జీవితం నుండి స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడంలో, తండాలు నిర్మించడంలో , వ్యవసాయం చేయటంలో ప్రముఖ పాత్ర పోషించాడని అన్నారు . ప్రజలందరూ ఎప్పుడు ఐక్యమత్యంతో సోదర భావంతో మెలగాలని ఆశించిన వ్యక్తి అని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో నాలుగో డివిజన్ కార్పొరేటర్ దండా జ్యోతి రెడ్డి , రాధాకృష్ణ , ఉమారాణి, మణికంఠ నాయక్ , సూర్య నాయక్ , ఎం.వీరన్న , బి కొండల్ , మల్సూర్ , వినోద భాయి , లక్ష్మీబాయి , బిక్కు భాయి , లలితా భాయి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు కొత్త సీతారాములు

ఖమ్మం, ఫిబ్రవరి 18(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):ఖమ్మం గాంధీచౌక్ వర్తక సంఘం భవనంలో సిఎస్‌సి హెల్త్ కేర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య పరీక్షల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు కొత్త సీతారాములు పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు . అనంతరం వారు మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్యానికి దృష్టిలో పెట్టుకుని ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు నిర్వాహకులను అభినందించారు . షుగర్, థైరాయిడ్, విటమిన్ డి , ఊపిరితిత్తులు, కిడ్నీ,లివర్, గుండె, బ్లడ్ గ్రూపింగ్, క్యాన్సర్, ఎలర్జీ వీటితోపాటు 54 రకాల పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ సాయి కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి డిస్టిక్ సెక్రెటరీ గజ్జి సూర్యనారాయణ, నాగేశ్వరావు, రాంప్రసాద్, క్యాంపు కోటేటర్ అశోక్ కుమార్, గోపి, తిరుపతి, పద్మ, ప్రసన్న, సీమ, శ్రీలత, రిజ్వాన, లావణ్య, మాధవి, జ్యోతి, ముజీబ్ ఖాన్‌లు పాల్గొన్నారు.

నేడు కూసుమంచిలో సంత్ సేవా లాల్ జయంతి వేడుకలు

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం, ఫిబ్రవరి 18(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి): తెలంగాణ వ్యాప్తంగా నియోజకవర్గస్థాయిలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న గిరిజనుల వేడుక భోగ్ బండార్ ఈ నెల 19న సోమవారం కూసుమంచి లో జరగనుంది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి, పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొంటారని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. కూసుమంచిలోని బంజారా భవన్ ఖాళీ స్థలంలో జరిగే ఈ వేడుకకు పాలేరు నియోజక వర్గంలోని అన్ని మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలని దయాకర్ రెడ్డి కోరారు.

పసందైన విందు...!

- వేడుకగా మంత్రి పొంగులేటి సోదరుడు ప్రసాద్ రెడ్డి తనయుని వివాహ రిసెప్షన్ వేడుక - భారీగా తరలొచ్చి లోహిత్ రెడ్డి- భవాని దంపతులను దీవించిన ప్రజానీకం
- అతిథులను ఆకట్టుకున్న 'పీఎస్ఆర్ ప్యాలెస్' సెట్టింగ్
- హాజరైన మంత్రులు భట్టి, కోమటి రెడ్డి, తుమ్మల, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు



ఖమ్మం, ఫిబ్రవరి 18(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి): కల్లూరు ఐదెకరాల్లో 'పీఎస్ఆర్ ప్యాలెస్' సెట్టింగ్.... ఇరవై ఐదు ఎకరాల్లో నోరూరించే వెజ్, నాన్ వెజ్ వంటకాలతో భోజన ఏర్పాట్లు..... మరో నలభై ఎకరాల్లో వాహనాల పార్కింగ్.... మొత్తంగా 70 ఎకరాల్లో జరిగిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డి తనయుని వివాహ రిసెప్షన్ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. వారి స్వగ్రామమైన కల్లూరు మండలం నారాయణపురం గ్రామంలో జరిగిన ఈ వేడుకకు ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగానే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు తరలొచ్చి లోహిత్ రెడ్డి భవాని దంపతులను దీవించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి – మాధురి దంపతులు ఆయన సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి– శ్రీలక్ష్మి దంపతులు వేడుకకు విచ్చేసిన వారినిఅతిథి మర్యాదలతో ఆహ్వానించారు. మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, కోమటి రెడ్డి వెంకట రెడ్డి, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, మట్టా రాగమయి, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, వివిధ వ్యాపార, వాణిజ్య రంగ ప్రముఖులు, ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని నూతన వధూవరులను దీవించారు.

- ఆకట్టుకున్న 'పీఎస్ఆర్ ప్యాలెస్ ' సెట్టింగ్...!

వధూవరులు ఆసీనులయ్యే వేదికను ఐదు ఎకరాల్లో సువిశాలంగా మలిచారు. పీఎస్ఆర్ ప్యాలెస్ పేరుతో రాజభవనం ఆకృతిలో భారీ సెట్టింగ్ వేశారు. హిందూ సంప్రదాయం ఉట్టిపడేలా, ఆధ్యాత్మిక గోపుర నమూనాలో తీర్చిదిద్దిన ఈ భారీ సెట్టింగ్ చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ భవనానికి ఇరువైపులా కొండల మీది నుంచి జలపాతం జాలువారేలా, సహజసిద్ధంగా ఉండేలా మలచడం విశేషం. వీటితోపాటు.. ప్రత్యేక స్టాళ్లు, పచ్చని పూదోటలు, ఫౌంటెన్లు ఇలాఅనేకం.. విశాల ప్రాంగణంలో ఆహ్లాదాన్ని పంచాయి.

- ఆహా ఏమిరుచి...!

వేడుకకు విచ్చేసిన అతిథులకు మొత్తంగా 12 స్టాళ్లను ఏర్పాటు చేసి విందు భోజనం పెట్టారు. పది స్టాల్లు నాన్ వెజ్, ఒక స్టాల్ వెజ్, మరో స్టాల్ వీఐపీ ల కోసం ఏర్పాటు చేశారు. చికెన్ బిర్యానీ, మటన్ బిర్యానీ, రొయ్యల వేపుడు, తందూరి చికెన్, మటన్ కర్రీ, గోంగూర బోటీ, యాట తలకాయ కూర.. రుమాలీ రోటీ.. ఇలా పలు రకాల నోరూరించే వంటకాలు విచ్చేసిన వారికి వడ్డించారు. భోజనం తర్వాత నాలుగు రకాల ఐస్ క్రీములు, సీతాఫల్ జ్యూస్, డబుల్ కా మీఠా, స్వీట్ ఖిల్లీ ఏర్పాటు చేసి అందరికీ పసందైన భోజనాన్ని అందించారు.

- ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రతా ఏర్పాట్లు...

వేడుకగా వేలాదిగా ప్రజానీకం తరలివస్తారని ముందుగానే అంచనా వేసి అందుకు తగినట్లుగా ఏర్పాట్లును చేశారు. పార్కింగు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రతా ఏర్పాట్లును చేశారు. ఏసీపీ స్థాయి అధికారుల పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లును పర్యవేక్షించారు. ప్రథమ చికిత్స కేంద్రం, ఫైర్ సర్వీస్ ఇలా భద్రత పరమైనఅన్ని జాగ్రత్తలనుతీసుకోని వేడుకలను సజావుగా నిర్వహించారు.

ఛలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 18 (పిసిడబ్ల్యూ న్యూస్): ధూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో ఈ నెల 20 వ తేదీ మంగళవారం మధ్యాహ్నం తలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి రాష్ట్రంలోని ప్రతీ ధూపదీప నైవేద్య అర్చకుడు హాజరై జయప్రదం చేయాలని ధూపదీప నైవేద్య అర్చక సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రపాల మహాదేవు కోరారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ధూపదీప నైవేద్య పథకం ప్రస్తుతం రాష్ట్రంలో 6500 ల దేవాలయాలకు అమలు అవుతుందన్నారు. 14 ఏండ్ల క్రితం ఒక వేయి ద్రవ్యాలకు ,15 వందల రూపాయలు అర్చకునికి గౌరవ వేతనం ఇచ్చే వారు గత ప్రభుత్వం దఫ దఫాలుగా పెంచి ప్రస్తుతం 4 వేల రూపాయలు ద్రవ్యాలకు 6 వేలు అర్చకునికి గౌరవ వేతనం అందిస్తుంది. జీవన వ్యయం పెరగడం, ప్రభుత్వం ఇచ్చే 6 వేలే సరిపోవడం లేదంటే అవికూడా రెగ్యులర్ గా ఇవ్వకపోవడంతో అర్చకుని కుటుంబ పోషణకు, దేవునికి ధూపదీప నైవేద్యాలు సమర్పించడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఏడు నెలల క్రితం నూతనంగా నియామకమైన అర్చకులకు ఈనాటికీ ఒక్క రూపాయి కూడా గౌరవ వేతనం రాలేదు. అందువల్ల కనీస వేతనం, ఉద్యోగ భద్రతలు ప్రధాన ఎజెండాగా శాంతియుతంగా ఛలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ లకు వినతి పత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి హాజరయ్యే అర్చక సంఘం నాయకులు గానీ అర్చకులు గానీ ఎలాంటి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా పూర్తి సమన్వయంతో శాంతియుతంగా పాల్గొనాలని ఆయన కోరారు.

నూతన భవన నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన వరంగల్ పార్లమెంట్ అస్పరెంట్ ఎంపీ అనంద్ కుమార్

హనుమకొండ, ఫిబ్రవరి 18 (పిసిడబ్ల్యూ న్యూస్): హనుమకొండ విలియం క్యారీ బాప్టిస్ట్ హై స్కూల్ మరియు సెంటినారి బాప్పనిస్ట్ చర్చి ప్రెసిడెంట్ టి.కిస్టోఫర్ రూబెన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నూతన విలియం బాప్టిస్ట్ హై స్కూల్ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెయింట్ పాల్స్ స్కూల్ అధినేత, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సి సెల్ కోఆర్డినేటర్ వరంగల్ పార్లమెంట్ అస్పరెంట్ ఎంపీ అనంద్ కుమార్ పాల్గొని అభివృద్ధి పనులను ప్రారంభించారు. అంతకుముందు గ్రేస్ కాన్సర్ ఫౌండేషన్, బాప్టిస్ట్ మిషన్ హాస్పటల్ హనుమకొండ వారి సౌజన్యంతో ఉచిత వైద్య మరియు కాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అనంద్ కుమార్ పాల్గొని అక్కడ పేదలకు అందుతున్న ఉచిత వైద్య సేవలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ టి. విజయ్ స్వరూప్, ఉపాధ్యక్షులు విల్సన్ వినయ్ కుమార్,ఎన్.జాసన్ ప్రసాద్, ఉపకార్యదర్శులు ధనియాల్,టి. మోసెస్,తేజరర్ కే. విద్యాకార్,ప్రవీణ్, లివింగ్ స్టన్, జోసేప్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు,శ్రీ లా సమాజం తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను ఆశీర్వధించిన వరంగల్ పార్లమెంట్ అస్పరెంట్ అనంద్ కుమార్

నడికూడ, ఫిబ్రవరి 18 (పిసిడబ్ల్యూ న్యూస్): నడికూడ మండలం కౌకొండ గ్రామ వాస్తవ్యులు (జర్నలిస్ట్) చుక్క శిరీష –సతీష్ దంపతుల పుత్రికలు జెస్సి,విధ్య ల నూతన వస్త్ర ఫల పుష్పలంకరణ కార్యక్రమానికి హాజరై చిన్నారులను ఆశీర్వదించిన సెయింట్ పాల్స్ స్కూల్స్ అధినేత,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సి సెల్ కోఆర్డినేటర్,వరంగల్ పార్లమెంట్ అస్పరెంట్ ఎంపీ అనంద్ కుమార్ అనంతరం అనంద్ కుమార్ సేవ సమితి ట్రస్ట్ జ్ఞాపికను ఈ సందర్భంగా అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కౌకొండ గ్రామ కమిటీ అధ్యక్షులు మేకల చిరంజివి, నడికూడ మండల కన్వీనర్ పేరువాల భాస్కర్ రావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వినయ్, సీనియర్ నాయకులు మేడిపల్లి రవీ, మంద కరుణాకర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

బండి సాంబయ్యని పరామర్శించిన వరంగల్ పార్లమెంట్ అస్పరెంట్ ఎంపీ అనంద్ కుమార్

ఆత్మకూరు, ఫిబ్రవరి 18 (పిసిడబ్ల్యూ న్యూస్):ఆత్మకూరు మండలం నీరుకుల్లా గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండి సాంబయ్య ఇటీవల సైకిల్ పై వెళ్తూ ప్రమాదవశాత్తు కింద పడడం వల్ల కుడికాలు విరగడం జరిగింది ఆసుపత్రి చికిత్స నిమిత్తం వారి నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న బండి సాంబయ్య ని పరామర్శించి మనోధైర్యం నింపిన సెయింట్ పాల్స్ స్కూల్ అధినేత, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సి కోఆర్డినేటర్, వరంగల్ పార్లమెంట్ అస్పరెంట్ ఎంపీ అనంద్ కుమార్ అనంతరం అనంద్ కుమార్ సేవా సమితి ట్రస్టు ద్వారా ఆర్థిక సాయంలి అందించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ మండల నాయకులు పొనుగోటి సత్యనారాయణ,నిరుకుల్లా గ్రామ అధ్యక్షులు కిన్నెరా చందు,వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం రాజు,ఉపాధ్యక్షులు దూరిశెట్టి రాంబాబు,యూత్ కాంగ్రెస్ నాయకులు డి. శ్రవణ్ పాల్గొన్నారు.